క్లుప్తంగా

అన్యాక్రాంత భూములు పేదలకు పంచాలి

కనిగిరిరూరల్: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేదలకు భూములు పంచేంత వరకు సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాలను ఒంగోలు నుంచి కనిగిరి తీసుకొచ్చి కనిగిరి ప్రాంతంలో పేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి తోడ్పాడాలని, నీటి సమస్య పరిష్కారానికి కనిగిరి పెద చెరువు, నాగుల చెరువులను సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లుగా మార్చాలని, పునుగోడు రిజర్వాయర్‌ను వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకుని రావాలని, నడికుడి కాళహస్తి రైలుమార్గం పనులను వేగ వంతం చేయాలని, పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలుత సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, గుజ్జుల బాలిరెడ్డి, పందిటి మోహన్, సయ్యద్ ఖాదర్ మస్తాన్, ఎస్టీయూ మాజీ రాష్ట్ర నేత బ్రంగి సుబ్రహ్మణ్యం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీతారాంపురంలో కూలీలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని లేదనకుండా కల్పించాలన్నారు. రోజు వారి కూలి రూ.600 తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి జాబ్ కార్డు దారునికి 200 రోజులు పని తగ్గకుండా పని కల్పించాలన్నారు.

కూటమి కక్ష..పేదలకు శిక్ష

- ఎండీయూ వాహనాలను రద్దు చేసిన ప్రభుత్వం
- పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు
- కూటమి ప్రభుత్వ నిర్ణయం పై సర్వత్రా విమర్శలు
- రోడ్డున పడ్డ ఎండీయూ వాహన ఆపరేటర్లు


ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకుంటున్న కార్డుదారులు (ఫైల్)

కనిగిరిరూరల్:

పేదల సంక్షేమం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. అందులో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు ఒకటి. ఈ విధానం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. వ్యయప్రయాసలకు లోను కాకుండా ఇంటి వద్దే సరుకులు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష కట్టి ఆ వాహనాలను తొలగించింది. జూన్ ఒకటి నుంచి రేషన్ దుకాణాల వద్దే సరుకులు తెచ్చుకోవాలని ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలం	రేషన్‌కార్డుల సంఖ్య	రేషన్ షాపులు	ఎండీయూ వాహనాలు
కనిగిరి	26,552	54	15
సీఎస్‌పురం	11,987	35	9
హెచ్‌ఎంపాడు	8,621	29	7
వెలిగండ్ల	10,273	28	6
పామూరు	18,341	44	12
పీసీపల్లి	10,316	27	7
మొత్తం	86,090	217	56

మళ్లీ రేషన్ కష్టాలు..

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ రేషన్ కష్టాలు వచ్చాయని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. రేషన్ డిపోల వద్ద వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చంటి బిడ్డల తల్లులు నిలబడలేని పరిస్థితులు అనేకం. సర్వేర్లు మొరాయించడంలో బియ్యం అందక అనేక ఇక్కట్లు పడిన రోజులు గతంలో ఉండేవి. సరుకులు కోసం ఒకటికి రెండు సార్లు తిరగడం.. బియ్యం మూటలు మోయలేక కూలబడి పోవడం.. వంటి రోజులు మళ్లీ వస్తున్నాయంటూ గుర్తు చేసుకుంటూ ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజలు కష్టాలు తెలుసుకుని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ఉపయోగకరంగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌ను అందిస్తే.. చంద్రబాబు సర్కార్ కేవలం రాజకీయ కుట్రతో ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థకు స్వస్తి చెబుతోందని తీవ్రంగా మండిపడుతున్నారు.

నియోజకవర్గంలో 56 వాహనాలు

నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లో 217 రేషన్ షాపులు ఉండగా. ఎండీయూ వాహనాలు 56 వరకు ఉన్నాయి. ఆరు మండలాల్లోని 80,090 రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రతి నెలల వాహనాల ద్వార ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు అందిచేవారు. అయితే ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా కార్డు దారులంతా సమీప రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు..

చంద్రబాబు సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ఐదేళ్లకు పైగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు ఇంటి గుమ్మం వరకు అందించి...ఉపాధి పొందుతున్న ఎండీయూ ఆపరేటర్లు, అసిస్టెంట్లు వీధిన పడినట్లు అయ్యింది. ఒక వాహనంలో ఇద్దరు ఉపాధి కల్గుతుంది. అయితే కూటమి సర్కార్ వచ్చాక అనేక దఫాలుగా ఎండీయూ వాహనాలపై, అపరేటర్లపై అసత్య ప్రచారాలు, అపోహాలు లేపి.. చివరకు తొలగింపు చర్యకు శ్రీకారం చుట్టారు. దీంతో వేలాది మంది ఉపాధి కోల్పోవాల్సిన దుస్థితి. వాస్తవానికి గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం 72 నెలల అగ్రిమెంట్ కాలంతో వీరు విధుల్లో చేరారు.. అంటే వీరికి ఇంకా 18 నెలల గడువు ఉంది. 2027 జనవరి వరకు వారికి అగ్రిమెంట్ ఉన్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వారిని తొలగింపునకు నిర్ణయం తీసుకుంది. ఎండీయూ ఆపరేటర్లను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనిక్కి తీసుకోవాలని ఆపరేటర్లు, ప్రజా సంఘాలు, ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు.

ఇంటి దగ్గరకే రేషన్ సరుకులు అందించాలి:



ఎండీయూ వాహనాలకు కూటమి సర్కార్ స్వస్తి పలకడం సరైంది కాదు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకులు అందేవి. ఆ వాహనాలు తొలగిస్తే పనులన్నీ మానుకుని రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాయాలి. వెళ్లిన రోజే రేషన్ అందుతుందనే నమ్మకం లేదు. కూలినాలీ చేసుకునే కుటుంబాల వారు తీవ్ర ఇక్కట్లు పడతారు. పనులు మానుకుని రేషన్ షాపు వద్దకు పరుగులు తీసి.. సర్వర్ వచ్చేదాక అక్కడే పడిగాపు కాయాలి. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.

ఎస్కే నాగూర్‌బీ, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా నాయకురాలు

233 పొగాకు బేళ్లు తిరస్కరణ


కొండపిలో వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య


టంగుటూరులో పొగాకు వేలం

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 233 పొగాకు బేళ్లను తిరస్కరించారు. వేలానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 646 బేళ్లను తీసుకురాగా 413 బేళ్లను కొనుగోలు చేసి 233 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి రూ.233.48 పలికింది. వేలంలో23 కంపెనీలు పాల్గొన్నాయని వేలం నిర్వహణాధికారి శ్రీనివాస రావు తెలిపారు.

కొండపి: కొండపిలో గురువారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని జగ్గరాజుపాలెం, ఎస్.ఎస్. కండ్రిక,పెట్లూరు,వర్ధినేనివారి పాలెం గ్రామాలకు చెందిన రైతులు 541 బేళ్లను తీసుకువచ్చారు. అందులో 416 బేళ్లు కొనుగోలు చేసి 125 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి రూ.252.66గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్ఒగన్నాయి. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

164 బేళ్లు తిరస్కరణ

కనిగిరిరూరల్: కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో గురువారం జరిగిన వేలం కేంద్రంలో 164 బేళ్లు తిరస్కరణ అయ్యాయి. కేపీ ఆగ్రహం క్లస్టర్ పరిధిలోని గ్రామాల నుంచి మొత్తం 518 పొగాకు బేళ్లు వేలం కేంద్రానికి రాగా అందులో 354 బేళ్లను బయ్యర్లు కొనుగోలు చేసి 164 బేళ్లను తిరస్కరించారు. 10 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. గరిష్ట ధర కేజీ రూ.280 పలకగా, కనిష్ట ధర రూ.200 పలికినట్లు అధికారులు తెలిపారు.

పలువురిని పరామర్శించిన దద్దాల


రమేష్‌ను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా గ్రామంలో ముప్పూరి అంకయ్య భార్య సాయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భౌతికకాయానికి దద్దాల నారాయణ నివాళులర్పించారు. కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఓకే రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పోలు జయరామిరెడ్డి, సీనియర్ నాయకులు యేరువ నరసింహ, మేకల మాల్యాద్రి, శీలం సుదర్శన్, భూమిరెడ్డి కొండారెడ్డి, యర్రంరెడ్డి మోహన్ రెడ్డి, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, పాలగిరి బాలిరెడ్డి, పులి రవి, అంద్రా వెంకట్రావు,వెంకటేశ్వర్లు, పోలిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!


పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం మధ్యలో ఓవీ రోడ్డు వంతెనపై ఏర్పడిన గుంత


వంతెనపై ఉన్న గుంతలో దిగి బోల్తా కొట్టిన కూలీల ఆటో

- వంతెనపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంత
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పొన్నలూరు: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని ఎర్రవాగు దగ్గర ఉన్న వంతెనపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వంలో ఓవీ రోడ్డును ముత్తరాసుపాలెం నుంచి కనిగిరి వరకు డబుల్ రోడ్డుగా విస్తరించారు. అయితే ఓవీ రోడ్డు మధ్యలో అక్కడక్కడ ఉన్న వంతెలను పూర్తిగా తొలగించి వీటి స్థానంలో కొత్తగా వంతెనలను నిర్మించారు. అయితే పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం మధ్యలో ఉన్న వంతెనను సంబంధిత కాంట్రాక్టర్ తొలగించి కొత్తగా నిర్మించలేదు. దీంతో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన కావడంతో మూడు అడుగుల మేర లోపలకు కుంగిపోయి గుంతగా ఏర్పడింది. ఈ క్రమంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు గుంత కనిపించకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల కాలంలో కూలీలతో వెళ్తున్న ఆటో చక్రం వంతెనపై ఉన్న గుంతలో దిగడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పాటు ప్రధానంగా వంతెన బ్రిటీష్ కాలంలో నిర్మించిన విశాలంగా వెడల్పు లేకపోవడంతో పలు రకాల లోడుతో వచ్చే లారీలు, ట్రాక్టర్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన దగ్గర ప్రమాదం పొంచి ఉన్నా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన అధికారులు నేటికి ఆ పని చేయలేదు. రాత్రి సమయాల్లో వచ్చే వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఓవీ రోడ్డులోని వంతెన కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడి కొన్ని రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు లక్ష్మీప్రసాద్

పామూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలంలోని నెల్లూరు రోడ్డు 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న బలుసుపాటి లక్ష్మీ ప్రసాద్ మోటార్‌బైక్‌పై నెల్లూరుజిల్లా తిమ్మారెడ్డిపల్లె వైపు నుంచి పామూరుకు వస్తున్నాడు. ఈ సందర్భంలో బైక్ కారును ఢీకొనగా ప్రసాద్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో ప్రసాద్‌ను పామూరు సీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్లు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు 3 రోజులపాటు పోలేరమ్మ తిరునాళ్ల జరుగుతుందని సర్పంచ్ ముత్యాల భారతీ, నారాయణరెడ్డి తెలిపారు. మొదటిరోజు శుక్రవారం ఆదిత్యాది నవగ్రహ మండపారాధన, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం అమ్మవారి మూల విగ్రహమూర్తికి 101 బిందెలతో జలాభిషేకం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, ఆదివారం మహాపూర్ణాహుతి, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేషన్ పంపిణీలో అప్రమత్తంగా వ్యవహరించాలి


బియ్యం నిల్వలు తనిఖీచేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పామూరు: రేషన్ పంపిణీలో రేషన్ డీలర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దే రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో గురువారం మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

సీఎస్‌పురం(పామూరు): రేషన్ దుకాణాల నిర్వహణలో రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలు రేషన్ దుకాణల్లోని రేషన్ సరకుల నిల్వలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

భూములు పరిశీలించిన జేసీ


భూములు పరిశీలిస్తున్న జేసీ

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు రెవెన్యూలో వెంగళాయపల్లి సమీపంలో బయోగ్యాస్‌కు కేటాయించిన భూముని లీజు అంచనా వేసేందుకు జేసీ గోపాలకృష్ణ గురువారం భూములు పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఉష, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అనంతరం మారెళ్లలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించి కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందేలా చూడాలన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని విశ్వబ్రహ్మణ కాలనీ, కాశిరెడ్డి కాలనీ తదితర శివారు ప్రాంతాల్లో గురువారం చైర్మన్ గఫార్ పర్యటించారు. స్థానికులు విద్యుత్, డ్రైనేజీ, నీరు, పారిశుధ్యం, తదితర సమస్యలను చైర్మన్‌కు వివరించారు. శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


పొన్నలూరులో యోగాసనం వేస్తున్న ఉద్యోగులు

పామూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఉల్లాసం సాధ్యమని డాక్టర్ జి.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సచివాలయంలో యోగా ట్రైనర్స్ 3వ బ్యాచ్‌కు గురువారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నిత్యం వారి వయసును బట్టి కొన్ని నిముషాలైనా యోగా ఎంతో ఎంతో ఉపయోగకరమన్నారు. యోగాలో మండలస్థాయిలో శిక్షణ పొందిన వారు జూన్ 3, 4, 5 తేదీల్లో సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎంపికచేసిన వారికి యోగాపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

కనిగిరిరూరల్: యోగాతో ఆరోగ్యం సాధ్యమని డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఎంపీడీఓ హనుమంతరావు, యోగా ట్రైనర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కనిగిరిలో యోగా చేస్తున్న ఉద్యోగులు

హనుమంతునిపాడు: యోగాంధ్ర సాధన ప్రతి ఒక్కరి లక్ష్యమని ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణలో ఆయన మాట్లాడారు. సర్వేయర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గోనా రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): పిల్లలు విద్యార్థి దశ నుంచే యోగా అలవర్చుకోవాలని గ్రంథాలయ పాలకుడు ఆళ్ల భాస్కరరావు అన్నారు. సీఎస్‌పురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు.


యోగాపై శిక్షణనిస్తున్న మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ ఏడుకొండలు, పీఎస్ నాగేశ్వరరావు

పొన్నలూరు: యోగాసనాలు ప్రతి రోజు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనర్ శ్రీదేవి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

కొండపి: యోగాతో మనసు ప్రశాంతంగా ఉంటుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. కొండపి-1,2 పెద్దకల్లగుంట సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి


అహల్యాబాయి హోల్కర్ శత జయంతి వేడుకల్లో బీజేపీ నేతలు

కనిగిరిరూరల్: అహల్యాబాయి హోల్కర్ శత జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కన్వీనర్ జె.రమాదేవి మాట్లాడుతూ రాణి అహల్యా బాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందు ఆలయాలను నిర్మించి ప్రసిద్ధికెక్కారన్నారు. అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్ అషారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసులరెడ్డి, పట్టణ అధ్యక్షులు నారాయణ, జిల్లా నాయకులు వెంకట్, నవీన్, గొప్పు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం


బాధితులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అనిల్ అన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ నివారణ కార్యక్రమంలో భాగంగా పీసీపల్లిలో ఆయన ఫ్లోరోసిస్ బాధితులతో మాట్లాడారు. డాక్టర్ యశ్విత మాట్లాడుతూ ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాధితులకు వాకర్లను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాగ్యవేణి, సూపర్‌వైజర్ రేణుకదేవి, సిబ్బంది పాల్గొన్నారు